

ప్రత్యేక దళిత పంచాయతీల ఏర్పాటుకు త్వరలో జిఒ

ఫైర్ డిజిపి సునీల్‌కుమార్

చింతలపూడి: ప్రత్యేక దళిత పంచాయతీ ఏర్పాటుకు త్వరలోనే జిఒ ఇస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చారని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు నివారణ శాఖ డిజిపి పివి.సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం భోగి పండుగ సందర్భంగా ఏలూరు జిల్లా చింతలపూడిలో స్థానికులతోకలిసి భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి దళితవాడ ప్రత్యేక పంచాయతీ కావాలని, దళితులు తమను తాము పరిపాలించుకోవాలని, రూ.రెండు కోట్ల నిధులు చొప్పున ఇవ్వాలని కోరారు. దళితవాడల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయం, మోడ్రన్ పాఠశాలలు, మంచి ఉచిత హాస్పిటల్స్ రావాలని పదేళ్లుగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల సిఎంను కలిసినప్పుడు నెల రోజుల్లో ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దళిత వాడలు ప్రత్యేక పంచాయతీలు చేయటం తన లక్ష్యమని చెప్పారు. ఎంఎల్‌ఎ, ఎంపీ సీట్లు వద్దని, అటువంటి ఆలోచన తనకు లేదని అన్నారు.

'బరి' తెగింపు..!



వీరవాసరం మండలంలో పందేల జోరు

- హైకోర్టు ఆదేశాలు బేఖాతరు
- ప్రేక్షక పాత్రలో పోలీసులు
- రెండు జిల్లాల్లో తొలిరోజు 250కు పైగా బరుల్లో కోడిపందేలు
- టిడిపి, వైసిపి పోటాపోటీగా బరుల ఏర్పాటు
- పందేల్లో పాల్గొన్న ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు, ప్రముఖులు
- పందేలను ప్రారంభించిన ఎంపీ రఘురామకృష్ణంరాజు
- బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాట జోరు
- పెదఅమిరం బరిలో అత్యధిక పందెం రూ.4 లక్షలు

కోర్టు తీర్పులంటే లెక్క లేదు.. మూగ జీవాలంటే దయలేదు. చట్టాలను గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే కోడి పందేలకు ప్రారంభోత్సవాలు చేయడం గమనార్హం. అడ్డుకోవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమై మామూళ్ల మత్తులో జోగుతుండటంతో ఈ ఏడాదీ కోడి పందేలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. పందెంరాయుళ్లు బరి తెగించి కోడి పందేలు నిర్వహించారు. రెండు జిల్లాల్లోనూ తొలి రోజు భోగి పండుగ ఆదివారం దాదాపు 250కు పైగా బరుల్లో రూ.50 కోట్లు మేర పందేల్లో చేతులు మారినట్లు అంచనా. బరుల వద్ద పేకాట, గుండాట జోరు కొనసాగింది. ఎంపీలు, ఎంఎల్‌ఎలే దగ్గరుండి పందేలను ప్రారంభించడంతో ఇక పండుగ మూడు రోజులు కోళ్ల కొట్లాట యథేచ్ఛగా సాగనుంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కోడి పందేలను అడ్డుకోవాలంటూ హైకోర్టు ఆదేశాలను జిల్లా అధికారులు తుంగలో తొక్కారు. ఆదివారం భోగి రోజు ఉదయం 11 గంటల తర్వాత రెండు జిల్లాల్లోనూ కోడి పందేల జోరు సాగింది. మధ్యాహ్నం నుంచి గుండాట, మూడు ముక్కలాటలను అనుమతించడంతో బరులన్నీ జాతరను తలపించాయి. టిడిపి, వైసిపి నాయకులు పోటాపోటీగా కోడి పందేల బరులు ఏర్పాటు చేసి పందేలు సాగించారు. రెండు జిల్లాల్లోనూ తొలిరోజు పెద్దా, చిన్నా 250కుపైగా బరుల్లో పందేలు యథేచ్ఛగా సాగాయి. దాదాపు రూ.50 కోట్లు వరకూ బెట్టింగుల రూపంలో చేతులు మారినట్లు అంచనా. సోమ, మంగళవారాలు సంక్రాంతి, కనుమ రోజు పందేల జోరు మరింత పెరగనున్నట్లు పందెంరాయుళ్లు చెబుతున్నారు. ప్రధాన రహదారులకు పక్కగా పందేలు సాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు భీమవరంలో తన ఇంటి వద్ద కోడిని వదిలి పందేలను ప్రారంభించారు. కాళ్ల మండలం పెదఅమిరంలో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో సాగిన బరి రెండు జిల్లాల్లోనే అతిపెద్ద బరిగా చెబుతున్నారు. ఇక్కడ అత్యధిక పందెం తొలిరోజు రూ.నాలుగు లక్షల వరకూ సాగినట్లు తెలిసింది. ఇక్కడ జరిగిన కోడిపందేల్లో వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, తెలంగాణ నాయకులు తీగల కృష్ణారెడ్డి వంటివారు పాల్గొన్నారు. టిడిపి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సీసలిలోని కోడిపందేల బరిలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌తోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ రెండు బరుల్లోనూ పందేలు పోటాపోటీగా సాగాయి. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన కోడిపందేల బరిలో దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి, తెలంగాణ ఇల్లెందు ఎంఎల్‌ఎ కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎంఎల్‌ఎ ఆదినారాయణ వంటి పలువురు నాయకులు పందేల్లో పాల్గొన్నారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు తన సొంతూరు బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో కోడిపందేలను ప్రారంభించారు. యలమంచిలిలో జరిగిన పందేల్లో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ పాల్గొని తిలకించారు. ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో పందేలు నిర్వహించేందుకు సైతం ఏర్పాట్లు చేశారు. బరుల వద్ద కార్లు, బైక్‌లు చూసి అంతా ఆశ్చర్యపోతున్న పరిస్థితి ఉంది. బరుల వద్ద మద్యం అమ్మకాలు సైతం యథేచ్ఛగా సాగాయి.

మామూళ్ల మత్తులో పోలీసులు

పందేలను అడ్డుకుంటామంటూ నిన్నటి వరకూ బీరాలు పలికిన పోలీసులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. భోగి రోజు రెండు జిల్లాల్లోనూ యథేచ్ఛగా పందేలు సాగినా అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది. బరుల ప్రాతిపదికన మామూళ్లు వసూలు చేసి వాటాలు పంచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి మండలంలోనూ చిన్న, పెద్ద పదికిపైగా బరులు కొనసాగాయి. ఎక్కడ అనువుగా ఉంటే అక్కడ పందేల బరుల ఏర్పాటు జరిగిపోయింది. సోమ, మంగళవారాల్లో మరింత జోరుగా పందేలు సాగనున్నాయి.

పందేలు, జూదాలను అడ్డుకోవాలి

కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలి - సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

చట్ట వ్యతిరేక కోడిపందేలు, జూదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను డిమాండ్ చేసింది. కోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా సంప్రదాయం పేరుతో కోడిపందేలను కొంత మంది రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సైతం నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ఈ మూడు రోజులు పందేలు, జూదాలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. సంప్రదాయాన్ని ప్రోత్సహించడం అంటే గ్రామీణ క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలను, ప్రజలకు ఆరోగ్యకర వినోదాన్ని అందించే కార్యక్రమాలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. జూదాల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోడిపందేల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులను అనర్హులుగా ప్రకటించాలని కోరారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు జరుగుతున్న తీరును పరిశీలించేందుకు కోర్టులే తగిన పరిశీలనా యంత్రాంగాన్ని నియమించాలని విజ్ఞప్తి చేశారు. చట్టవిరుద్ధంగా కోడిపందేలు జరగడానికి ముఖ్యమంత్రి, హోం శాఖామంత్రిని ప్రధాన బాధ్యులుగా, దోషులుగా పరిగణించాలని డిమాండ్‌చేశారు. వీరితోపాటు జిల్లా కలెక్టర్, ఎపి, ఎఎస్‌పి, డిఎస్‌పి స్థాయి అధికారులను కోర్టు ఆదేశాల అమలులో వైఫల్యానికి బాధ్యులను చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని, ప్రజలు, యువతీ యువకులు, విద్యార్థులు భాగస్వాములయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వివిధప్రాంతాల్లో వివిధ రకాల క్రీడలను నిర్వహిస్తున్న, ప్రోత్సహిస్తున్న సంఘాలను, సంస్థలను, ప్రజలను సిపిఎం అభినందించింది.



సంక్రాంతి క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న ఎఎంసి ఛైర్మన్ రసూల్ బీబీ

40 సంవత్సరాలనాడే డివైఎఫ్‌ఐ ఆలోచన అసాధారణం

ఆటల పోటీల ప్రారంభోత్సవంలో ఎఎంసి ఛైర్మన్ రసూల్‌బీబీ

ప్రజాశక్తి - ఆకివీడు

యువతను చెడు మార్గాల వైపు వెళ్లకుండా వారి ఆలోచనలు మళ్లించడానికి 40 సంవత్సరాల క్రితమే డివైఎఫ్‌ఐ ఆలోచన చేయడం అసాధారణ విషయమని ఎఎంసి ఛైర్మన్ రసూల్‌బీబీ అన్నారు. ఆ ఆలోచనలకు రూపం ఇచ్చి నేటి వరకు కొనసాగించడం వారి అంకితభావానికి నిదర్శనమన్నారు. డివైఎఫ్‌ఐ సంక్రాంతి యువజనోత్సవాల క్రీడా ప్రాంగణాన్ని శనివారం సాయంకాలం స్థానిక జెడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడోత్సవాల కన్వీనర్ డోకల రవితేజ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభలో వైసిపి యువ నాయకుడు అంబటి రమేష్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల యువతకు డివైఎఫ్‌ఐ ఎంతోకాలం ఆశాజ్యోతిగా నిలిచిందన్నారు. అందుకు ఆ వర్గాల ప్రతినిధిగా తాను వారిని అభినందిస్తున్నానన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడు తోట వాసు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలు ఆటలు ఆగకుండా నిర్వహించడం వారి అంకితభావానికి నిదర్శనమన్నారు. వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ యువతలో సామాజిక స్పృహ కల్పిస్తున్న డివైఎఫ్‌ఐని ప్రోత్సహించాలన్నారు. జిల్లా కార్యదర్శి శివ సాయి మాట్లాడుతూ మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మించాలన్నారు. ప్రభుత్వం క్రీడల బడ్జెట్ పెంచాలన్నారు. మెగా డిఎస్‌సి నిర్వహించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 30 వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో డివైఎఫ్‌ఐ జిల్లా కోశాధికారి బి.రాంబాబు మాట్లాడారు. తొలుత డివైఎఫ్‌ఐ పతాకాన్ని ధనుష్ ఆవిష్కరించారు. అలాగే పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, డివైఎఫ్‌ఐ నేత శివన్నారాయణలకు నివాళులు అర్పించారు.

అంతర్మథనం.. అసంతృప్తి.. ఆవేదన..!

పండుగ వేళ కూడా సమస్యలతో రోడ్డెక్కుతున్న జనం ఓ పక్క.. మరోపక్క అధిష్టానం చేర్పులు, మార్పులతో అధికార పార్టీ ఎంఎల్‌ఎల్లో అంతర్మథనం సాగుతుండగా.. పొత్తుల వ్యవహారంలో ఏయే సీట్లు ఎవరికి దక్కుతాయో అర్థంగాక ప్రతిపక్ష టిడిపి, జనసేన నేతల్లో ఒకింత గందరగోళం, అసంతృప్తి నెలకొంది. టిక్కెట్ చేజిక్కించుకున్న వారు ఇక తమ అడుగులు ఎలా వేయాలా అని అంతర్మథనం చేస్తుండగా దక్కని వారు తీవ్ర అసంతృప్తి బాహటంగానే వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎటూ తేలని వారు ఇన్నాళ్లు తాము పడిన కష్టం ఫలిస్తుందా, లేదా అని ఆవేదనకు గురవుతున్నారు.



జిల్లాలో ఎన్నికల వేడి మరింత రాజుకుంది. మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని పార్టీలూ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా అధికార వైసిపి జిల్లాలో ఇప్పటికే ఏలూరు ఎంపీ, పోలవరం, చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థులను ప్రకటించింది. ప్రధానంగా వైసిపి అధిష్టానం ఇప్పటి వరకూ జిల్లాలో సిట్టింగులను మార్చిన స్థానాలనే అధికారికంగా ప్రకటించింది. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ తాను ఎంపీగా పోటీ చేయననడంతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్‌కు టిక్కెట్ దక్కింది. ఆయన కూడా అయిష్టంగానే పోటీకి అంగీకరించినట్లు తెలుస్తోంది. ఏదేమైనా ఎంపీ అభ్యర్థి మార్పు వల్ల వైసిపి అధిష్టానానికి పెద్దగా ఇబ్బందులేమీ ఏర్పడ లేదు. అయితే చింతలపూడి టిక్కెట్ మార్పు మాత్రం ఆ పార్టీకి చింత మిగులుస్తుందా, లేక సరైనదేనా అనేది ఎన్నికల ఫలితం వెలువడే వరకూ వేచిచూడాలి. ఇక పోలవరం టిక్కెట్ మార్పుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెల్లం బాలరాజు ఎంఎల్‌ఎగా ఇక్కడ పాత ముఖమే. ఆయనపై వ్యతిరేకత ఉందనే పేరుతో ఆయన భార్య తెల్లం రాజ్యలక్ష్మికే టిక్కెట్ కట్టబెట్టడంపై ఆ పార్టీ నేతలతోపాటు రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భర్త బదులు భార్యకు టిక్కెట్ ఇస్తే వ్యతిరేకత పోతుందా అని ప్రశ్నిస్తున్నారు. అయితే ఇక్కడ టిడిపిలో గ్రూపు విభేదాలు వైసిపికి కలిసొచ్చే అంశమని, అందుకే వైసిపి అధిష్టానం స్వల్ప మార్పుతో సరిపెట్టిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మరికొన్ని స్థానాల్లో సిట్టింగ్ ఎంఎల్‌ఎలను మార్చాలని అధికార పార్టీ యోచిస్తున్నా ఆయా నియోజకవర్గాల్లో సామాజిక తరగతుల పొందిక, దాని ఆధారంగా బలమైన అభ్యర్థులు దొరక్కపోవడంతో కొంత వెనక్కి తగ్గినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికీ ఏలూరు, ఉంగుటూరు, ఉండి, పాలకొల్లు, నరసాపురం స్థానాల్లో సందిగ్ధత అధికార పార్టీలో కొనసాగుతుండటం గమనార్హం. పోలవరం అభ్యర్థిని మార్చిన తరహాలోనే ఏలూరులో అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం ఉంది. ఉంగుటూరులో అదే సామాజిక తరగతికి చెందిన బలమైన అభ్యర్థి లేకపోవడంతో వెనక్కు తగ్గుతున్నట్లు తెలుస్తోంది. పాలకొల్లు టిక్కెట్ ఎవరికి దక్కుతుందో నామినేషన్ల పర్వం వరకూ చెప్పలేమని అధికార పార్టీ నేతలే చెబుతుండటం గమనార్హం. నరసాపురంలో సిట్టింగుకే మళ్లీ దక్కే అవకాశం ఉందని, ఉండిలో మాత్రం ఎంపీ అభ్యర్థిని బట్టి నిర్ణయం ఉండొచ్చనే ప్రచారం ఇటీవల మొదలైంది. ఏదేమైనా అధికార పార్టీలోనూ అభ్యర్థుల ఎంపిక అధిష్టానానికి కత్తిమీద సాములా తయారైనట్లు కన్పిస్తోంది.

ఇక పొత్తుల వల్ల ఏ స్థానం నుంచి ఏ పార్టీ పోటీ చేస్తుందో స్పష్టత లేక టిడిపి, జనసేన నేతలు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా ఏలూరు జిల్లాలో దెందులూరు, కైకలూరు, నూజివీడు స్థానాలు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, ఉండి, తణుకు, పాలకొల్లు స్థానాల్లో టిడిపికి పెద్దగా ఇబ్బంది లేదు. నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం స్థానాలు పొత్తులో జనసేనకు ఏవి వెళ్తాయో తేలక ఇటు టిడిపి, అటు జనసేన నేతల్లో ఉత్కంఠ నెలకొంది. జనసేన ఆశావహుల పరిస్థితి ఎలాగున్నా టిడిపి ఆశావహుల్లో మాత్రం ఒకింత ఆవేదన సైతం కన్పిస్తోంది. ఇంతకాలం తాము చాలా సొమ్ము ఖర్చు పెట్టామని, ఇప్పుడు పొత్తులో సీటు మిత్రపక్షానికి వెళ్తే తమ పరిస్థితి ఏమిటని నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

\- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

భోగి మంటల వద్ద అంగన్వాడీల భగభగ

అంగన్‌వాడీలూ పండుగ వేళ కూడా పోరాట స్ఫూర్తితో ఉదయమే సమ్మె శిబిరాల వద్దకు చేరుకుని షోకాజ్ నోటీసులు భోగి మంటల్లో వేసి ప్రభుత్వ తీరుపై భగభగలాడారు. పాలకొల్లు, పోడూరు, వీరవాసరం, మొగల్తూరు, గణపవరం, పెనుగొండ, యలమంచిలిలో షోకాజ్ నోటీసులు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. పెనుమంట్రలో ముగ్గులు వేసి నిరసన తెలిపారు. భీమవరం రూరల్ మండలం వెంప, శ్రీరాంపురంలో ఎస్మా జిఒ కాపీలు దహనం చేసి నిరసన తెలిపారు. అత్తిలిలో షోకాజ్ నోటీసులు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ముగ్గులు వేసి, పిండి వంటలు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.



పోడూరులో..



అత్తిలిలో వంట చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



యలమంచిలిలో..



వీరవాసరంలో..



పెనుగొండలో..



గణపవరంలో..



పెనుమంట్రలో..



భీమవరంలో..



పాలకొల్లులో..



మొగల్తూరులో..



భీమవరంలో..

ఇవేం విధానాలు.. ఇదేమి నిర్బంధం

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నిర్బంధాన్ని ఖండిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన భీమవరంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడారు. పాలకొల్లులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడగా, యలమంచిలి మండలం చించినాడలో ప్రతులను దహనం చేశారు.



పాలకొల్లులో..

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పలు జిఒ కాపీల ప్రతులను టిడిపి నేతలు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. పాలకొల్లులో ఎంఎల్‌ఎ రామానాయుడు, కాళ్ల మండలంలో ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పాల్గొని నిరసన తెలిపారు.



కాళ్లలో..



పాలకొల్లులో..



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎఎంసి చైర్మన్ చిల్లే లావణ్య

సంక్రాంతి పవిత్రతను కాపాడుకుందాం

ప్రజాశక్తి - ఆచంట

తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే సంక్రాంతి పండుగ పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందని ఎఎంసి చైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. ఆదివారం వల్లూరులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదం వంటి చెడు వ్యసనాలవైపు యువత పక్కదారి పట్టకుండా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు నారిన వీర వెంకట సత్యనారాయణ, పిచ్చెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపిపి శ్రీను, ఎంపిటిసి ఎ.సుబ్బారావు, వల్లూరు లక్ష్మి, పి.వరలక్ష్మి, ఆకెళ్ల సుధ, కేతా సుబ్బలక్ష్మి న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు.



ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన

ప్రజాశక్తి - పోడూరు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం ఆదివారం మండలంలోని మట్టపర్రు, పెనుమదం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఆర్ఐ కంచు రాంబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి నిర్వహించారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ఇవిఎం, వివిప్యాట్ల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించామని తెలిపారు.

కోడి పందేలు నిర్వహించొద్దంటూ నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

తమ గ్రామంలో కోడిపందేలు, జూద క్రీడలు నిర్వహించొద్దంటూ గొల్లల కోడేరు సర్పంచి కుక్కల లక్ష్మి, శ్రీనివాస్‌వర్మ నిరసన తెలిపారు. శనివారం జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్‌కు, పాలకోడేరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆదివారం గ్రామంలో పందేలు నిర్వహించడంతో స్థానిక సచివాలయం వద్ద సర్పంచి కుక్కల లక్ష్మి, వార్డు సభ్యులు కలిసి శ్రీనివాస్ వర్మ నిరాహార దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూద క్రీడలు నిర్వహించడం వల్ల యువత పెడదోవ పడుతోందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదని విమర్శించారు.



పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచి దంపతులు



పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన శరీర సౌష్టవ పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

డివైఎఫ్ఐ నిర్వహించిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి స్థానిక దొరగారి చెరువుగట్టు వద్ద జరిగాయి. ఈ పోటీలను బాడీ బిల్డింగ్ రాష్ట్ర అసోసియేషన్, జిల్లా అసోసియేషన్ల డివైఎఫ్ఐ సహకారంతో నిర్వహించాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 70 మంది పోటీదారులు పాల్గొన్నారు. ఎపి ఫిట్నెస్ అండ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అడ్డాల వీరభద్రరావు ఆధ్వర్యంలో రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన పలు జిల్లాల కార్యదర్శులు మొత్తం ఏడుగురు జ్యూరీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ముందుగా ప్రతి జిల్లా నుంచి ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. అనంతరం పలు విభాగాలలో పోటీలను విడివిడిగా రాత్రి బాగా పొద్దుపోయే వరకు నిర్వహించారు. కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ నాయకులు జిల్లా కార్యదర్శి గెడెల ధనుష్, బి.రాంబాబు, బి.వి.వర్మ, ఉత్పల కన్వీనర్ దోశిల రవి, వెంకీ అప్పారావు, తవిటి నాయుడు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వేయి మంది పైగా దాటి అభిమానులు ప్రేక్షకులు పాల్గొనడం విశేషం.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జనసేన సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు, బొమ్మిడి నాయకర్ నాయకత్వానికి ఆకర్షితులై మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో మైలా ముత్యాలరాజు ఆధ్వర్యంలో మైలా నాగరాజు, కొప్పాడి ప్రవీణ్, సంగాని నాగార్జున, మైలా దుర్గారావు, మైలా శ్రీను, తిరుమాని శ్రీను, కొల్లాటి ఏడుకొండలు, ఆంజనేయులు ఏసు ఇలా దాదాపు 100 మంది వైసిపి నుంచి జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో వాతాడి కనకరాజు, వాతాడి రమేష్, బందెల రవీంద్ర, నిప్పులేటి తారక రామారావు, గుబ్బల మార్రాజు, కారుమంచి జీవరత్నం, అందే దొరబాబు, ఒడుగు ఏసు, రాధాకృష్ణ, యడ్లపల్లి మహేష్, బెల్లంకొండ నాయుడు, పులపర్తి రాంబాబు, ఇంటి మురళి, పులి భుజంగరావు, పోతిశెట్టి సాంబ, తిరుమాని సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వైసిపికి చెందిన సభ్యులు

గ్రామాల్లో భోగి మంటల సందడి

ప్రజాశక్తి - ఆచంట

సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. దూరప్రాంతాల్లో స్థిరపడిన వారు, స్నేహితులు, బంధువులంతా గ్రామాలకు తరలిరావడంతో ఉల్లాసభరితంగా భోగి పండుగను జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు, అయోధ్యలంక, పలు ప్రధాన కూడళ్లలో పెద్ద ఎత్తున భోగిమంటలు వేశారు. ప్రసిద్ధిగాంచిన రామేశ్వరస్వామి, మాసేనమ్మ ఆలయాలను దర్శించు కున్నారు. పల్లెలంటేనే సంస్కృతీ సంప్రదాయాలకు పెట్టింది పేరు. భోగి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హరిదాసు కీర్తనలు, జానపద గీతాలు, డూడూ బసవన్న విన్యాసాలు, మరువలు వేసిన అంద మైన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. **పాలకొల్లు :** పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ చైర్మన్, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన సంక్రాంతి సంబరాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టాయి. అర్ధరాత్రి వరకు సాగిన కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. స్థానిక బిఆర్‌ఎంవి ఉన్నత పాఠశాల గ్రౌండ్ జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి వేల సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలూ కుటుంబ సమేతంగా తరలివచ్చారు. సంక్రాంతి పండుగను ప్రతిబింబించేలా ఆ ప్రాంగణం లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలతో సంక్రాంతి పల్లె వాతావరణం చోటుచేసుకుంది. ముందుగా అడుగుపెట్టగానే ముఖ ద్వారం వద్ద గ్రామ దేవత దర్శనమిస్తారు. ఎంఎల్ఎ కుటుంబ సమేతంగా పూజ నిర్వహించారు. గగ్గిరెద్దుల సన్నాయిలు, భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, బొమ్మల కొలువు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. సినీ నటుడు శివారెడ్డి మిమిక్రీ అందర్నీ నవ్వులతో ముంచెత్తింది. సినీ గాయకురాలు శ్రావణి భార్గవి పాడిన పాటలు ఆలరించాయి. జబర్దస్త్ టీం రాకెట్ రాఘవ, గాలిపటాల సుధాకర్, మోహన్, బాబీల అభినయం నవ్వుల వర్షం కురిపించాయి. సత్య సంగీత విభావరి అందర్నీ ఆకట్టుకుంది. విశాఖపట్నంకు చెందిన షాడో, మిర్రర్ నటన, కాంతరా, హవర్ బోర్డు వంటి ప్రదర్శనలు ఆలరించాయి. స్థానిక చిన్నారుల నత్య ప్రదర్శనలు అందర్నీ మెప్పించాయి. సభా ప్రాంగణం జన సందోహంతో కిక్కిరిసిపోయింది. మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో వరుసగా పదిమంది విజేతలుగా నిలిచారు.



ఆచంటలో హరిదాసు సందడి



సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారి

సంక్రాంతి కానుకగా తాడేరు వంతెన ప్రారంభం

శాసనమండలి చైర్మన్ మోషేనురాజు, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలకు సంక్రాంతి పండుగ కానుకగా నూతనంగా రూ.2.30 కోట్ల నిధులతో నిర్మించిన తాడేరు వంతెన ప్రారంభించినట్లు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వారు వంతెన ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. ముందుగా శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న వంతెనను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ స్వయంగా పరిశీలించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. శంకుస్థాపన చేసిన రెండు, మూడు నెలల్లోనే వంతెన పనులు పూర్తి చేయడానికి కృషి చేసిన గ్రంధి శ్రీనివాస్‌ను అభినందిస్తున్నానని తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు, పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో భీమవరం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని, మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డికి అవకాశం కల్పిస్తే భీమవరం నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై కొంతమందికి అవగాహన లేదని, అందుకే ఇష్టానుసారం మాట్లాడుతున్నారని తెలిపారు. దయచేసి అభివృద్ధిని తెలుసుకోవాలన్నారు. వంద పడకల ఆసుపత్రిని సాధించామని, అప్రోచ్ బ్రిడ్జిలకు నిధులు మంజూరు చేయించామని, కంపోస్ట్ యార్డుకు ఆరున్నర ఎకరాల భూమిని సేకరించడంతో పాటు రోడ్ల నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేయించడం జరిగిందన్నారు. మరో పక్క రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. టిడ్కో గృహాలకు సంబంధించి మొదటి విడతగా 2000 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించినట్లు తెలిపారు. రెండో విడత ఈ నెల 20వ తేదీ దాటిన తర్వాత లబ్ధిదారులకు అప్పగించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. 900 గృహాలైతే పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అన్నీ మౌలిక వసతులతో అప్పగించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మరో 2500 గృహాలు ఫినిషింగ్ వర్క్‌లో ఉన్నాయన్నారు. అయితే వీటి పనులను పూర్తి చేయడానికి రెండు మూడు నెలలు పడుతుందని, ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ వస్తే గహాలు అప్పగించడం సాధ్యం కాదు కాబట్టి, వీటిని కూడా ఈనెల 20వ తేదీ దాటిన తర్వాత అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ వెంకటస్వామి, వేంద్ర వెంకటస్వామి, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు పాల్గొన్నారు.



తాడేరు వంతెన ప్రారంభిస్తున్న మోషేనురాజు

షరామామూలే..

యథేచ్ఛగా కోడిపందేల నిర్వహణ
లక్షల్లో చేతులు మారుతున్న వైనం
పట్టని అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతి పండుగ సందర్భంగా పెదఅమిరం, సిసలి గ్రామాల్లో భారీస్థాయిలో కోడిపందేలు, జూదాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పెదఅమిరంలో జాతర తలపించేలా క్యాసినో జూదాలు సాగాయి. సుమారు రూ.10 కోట్లలో నగదు చేతులు మారాయి. మద్యం ఏరులై పారుతోంది. రాత్రి సమయాల్లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించారు. పెదఅమిరం, సీసలిలో జరిగిన కోడిపందేలకు కృష్ణా, ఏలూరు జిల్లాలు, తెలంగాణ ప్రాంతం నుంచి పందెం రాయుళ్లు పెద్ద ఎత్తున వచ్చారు. పెదఅమిరంలో క్యాసినో, గ్యాంబ్లింగ్, పేకాట శిబిరాలు, సీసలిలో భారీగా కోడిపందేలు జరుగుతున్నాయి. పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ గ్రామాల్లో భారీస్థాయిలో బరులు ఏర్పాటు చేశారు. బరుల వద్ద బౌన్సర్లను పెట్టి పందేలు నిర్వహించారు. అలాగే పేకాట, గుండాట వంటి జూద క్రీడలు కూడా జోరుగా సాగుతున్నాయ. కోడి పుంజుల కాళ్లకు కత్తులు కట్టి బరిలో వదిలారు. ఒక్కో రౌండుకు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకూ పందేలు కాశారు.

టోకెన్ రూ.2 వేలు..

పెదఅమిరంలో, కోడిపందేలకు అదనంగా కోతముక్క, లోపల, బయట, మూడు ముక్కలాట కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. పేకాట శిబిరాలతోపాటు క్యాసినో నిర్వహించారు. క్యాసినోలోకి వెళ్లడానికి కస్టమర్లకు రూ.2 వేల టోకెన్ పెట్టారు. క్యాసినో జూదానికి ప్రత్యేకంగా సిసి కెమెరా లను పెట్టి జూదం, బెట్టింగ్, గ్యాబ్లింగ్ నిర్వహించారు. పెదఅమిరంలో జరిగే కోడిపందేల్లో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, టిటిడి మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. సీసలిలో కోడిపందేల బరిలో పాస్ లున్న వారినే కోడి పందేల గ్యాలరీలోకి అనుమతించారు. విఐపిలకు, పందెం రాయుళ్లకు, మహిళలకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. పందెం ప్రాంతంలో నాలుగు ఎల్‌సిడిలు ఏర్పాటు చేశారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, దెందులూరు మాజీ చింతమనేని ప్రభాకర్, తదితర ప్రముఖులు పాల్గొని పందేలు కాశారు.


స్తంభించిన ట్రాఫిక్..

పెదఅమిరంలో ప్రధాన రహదారికి ఇరువైపులా కోడి పందేల బరులు ఉండడంతో రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు మార్జిన్లో కార్లు నిలిపివేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు కూడా చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మొగల్తూరులో నిర్వహిస్తున్న కోడి పందేలు

వీరవాసరం: మండలంలో కోడిపందేల నిర్వహణ షరా మామూలే అన్నట్లుగా సాగింది. అనధికార అనుమతులతో కోడికి కత్తి కట్టి పందేలు నిర్వహించారు. బరులన్నీ వైసిపి నేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పందెం రాయుళ్ల మధ్య మొదటి రోజు అధిక సంఖ్యలో పందేల జరగడంతో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారాయి. ఇదే అదునుగా గుండాట కూడా సాగింది. రాజకీయ ఒత్తిడితో పోలీసులు కూడా ఏమి చేయలేని స్థితిలో చూసీచూడనట్లు వదిలేయడంతో బరుల వద్ద యథేచ్ఛగా కోడిపందేలు కాస్త జూద పందేలుగా మారాయి. నందమూరుగరువు, నవుడూరు, అండలూరు, జొన్నలపాలెం, మత్స్యపురి, మత్స్యపురిపాలెం, రాయకుదురులలో కోడి పందేలు జరిగాయి.



కాళ్ల : కోడిపందేలను చూస్తున్న గోకరాజు రామరాజు, కామినేని శ్రీనివాస్, తీగల కృష్ణారెడ్డి

పోడూరు : మండలంలోని కవిటం, పెనుమదం, జిన్నూరు, గుమ్మలూరు గ్రామాల్లో ఆదివారం భోగి రోజు కోడిపందేలు, గుండాట, పేకాట యథేచ్ఛగా నిర్వహించారు. ఉదయం వరకూ ఎటువంటి అనుమతులు లేవని బరుల వద్ద హడావుడి చేసిన పోలీసులు, పై అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వారు బరుల వద్ద నుంచి జారుకున్నారు. దీంతో పందెం రాయుళ్ల చేతుల నుంచి లక్షల్లో చేతులు మారాయి.

ఆచంట : సంక్రాంతి సందర్భంగా ఆదివారం మండలంలో ఆచంట, వల్లూరు గ్రామాల్లో నిర్వాహకులు జోరుగా కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వహించారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని సగంచెరువు, పూలపల్లి, వడ్లవానిపాలెం తదితర ప్రాంతాల్లో కోడిపందేలు, గుండాట జోరుగా సాగుతున్నాయి. ఎక్కడా పోలీసుల పర్యవేక్షణ లేదు. సగం చెరువు వద్ద ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఒక వ్యక్తిని మరొక వ్యక్తి ఇనుపరాడ్డుతో కొట్టాడని, ఆయన పరిస్థితి విషమంగా ఉందని పందెం రాయుళ్లు చెబుతున్నారు. ఎక్కడ చూసినా నిర్వాహకులు తిరునాళ్ల వలె కోడి పందేలు నిర్వహిస్తున్నారు. ప్రేక్షకులు వీక్షించడానికి గ్యాలరీలు కూడా ఏర్పాటు చేశారు.

ఆకివీడు : కోడిపందేలు వేయించేది లేదంటూ పోలీసులు బీరాలు పలికినా అవి ఒట్టి మాటలుగా మిగిలిపోయాయి. శనివారం రాత్రి పందేల బరులు లాగేస్తున్నామంటూ హడావుడీ చేసిన పోలీసులు ఆదివారం మధ్యాహ్నానికి చేతులెత్తేశారు. ఇక అంతే ఒక పక్క కోడిపందేలు, మరో పక్క పేకాట, జూదాలు జోరందుకున్నాయి. పందేలు మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని నిర్వాహకులు అంటున్నారు. ఇప్పటికే కోట్ల రూపాయలకుపైగా చేతులు మారాయని సమాచారం.

యలమంచిలి : ఈ ఏడాది కూడా మండల వ్యాప్తంగా కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వాహకులు యథావిధిగా నిర్వహించారు. కేవలం భోగి రోజున మండల వ్యాప్తంగా రూ.కోట్లు చేతులు మారినట్లు పలువురు చెబుతున్నారు.

మొగల్తూరు : మండలంలోని కోడిపందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు, రెవెన్యూ అధికారులు పది రోజులుగా ఊదరగొట్టారు. చివరకు చేతులెత్తేయడంతో పందేలు భారీ స్థాయిలో జరిగాయి.



కాళ్ల : బరుల వద్ద గుండాట నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఐద్వా ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

సంక్రాంతి సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు పట్టణ స్థాయి ముగ్గుల పోటీలు రుస్తుంబాద వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొగాకు పూర్ణ అధ్యక్షత వహించగా కొత్తపల్లి జానకిరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐద్వా ఈ పోటీలతో మహిళలందరినీ ఒక చోటకు చేర్చి పండుగ వాతావరణాన్ని కల్పించారన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని, మహిళల సమస్యల పరిష్కారం కోసం ఐద్వా ఎప్పుడూ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి వీరవల్లి గంగాధర్ (నాని) ఆటల పోటీలకు ఆర్థిక సహకారాన్ని అందించారు. నాని భార్య విజయలక్ష్మి, సోదరుడు శ్రీధర్, డాక్టర్ గంగయ్య, చిన్నమిల్లి బుజ్జి, నరసయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ముగ్గుల పోటీకి జడ్జీలుగా డాక్టర్ ఆరేటి అమ్మాజీ, సిరిగినీడి యామిని, గోరు రమాదేవి, శ్వేత వ్యవహరించారు. జిల్లా కమిటీ సభ్యురాలు మహమ్మద్ సరోజిని పర్యవేక్షించారు. ఈ సభకు పొగాకు పూర్ణ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, నోముల కొండ పాల్గొన్నారు.



ఆటల పోటీల వద్ద మాట్లాడుతున్న కొత్తపల్లి జానకిరామ్

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. భోగి పండుగను పురస్కరించుకుని యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం నిర్వహించారు. యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణరాజు పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.





క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విక్టర్ ప్రసాద్, సభ్యులు

కుల వివక్ష అంతానికి ఐక్య పోరాటాలు

రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో కుల వివక్ష రోజురోజుకూ పెరుగుతోందని, దాని అంతంకై ఐక్య పోరాటాలు మరింత ఉధృతం చేయాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. భీమవరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మార్మూడి విక్టర్ ప్రసాద్, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శోభారాణి కలిసి కెవిపిఎస్ జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారుమూడి ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకై దళితులందరూ ఐక్యంగా అసమానతలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. ఆర్‌డిఒ శ్రీనివాసులురాజు మాట్లాడుతూ సమాజంలో కుల వివక్ష, అంటరానితనం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబు, ఎపి బహుజన జెఎసి ఫౌండర్ తాళ్లూరి మధు, రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసెఫ్, గౌరవాధ్యక్షులు కాటం స్టాలిన్, కార్యదర్శి డివి.సాగర్ పాల్గొన్నారు.